# పిడికెడు మెతుకులు

దయగల మారాజులు...!

ఇంటిముందుకొచ్చినోళ్ళకు ఒగపూట అన్నం పెట్టరు.

ఒగరూపాయి దుడ్డీరు... బతికే దోవ చూపీరు...

నీతులు మాత్రం బో చెప్తారు...!

ఏమన్నావు సోమీ... కండ్లు కాళ్ళు బాగుండాయి..., పురుగుల మందు తాగి సచ్చేబదులు ఏదన్నా పనిచేసుకోని బతకొచ్చు గదా అంటాండావా?

అంటే నేను ఏపనీ చేయని సోంబేరిననుకున్నావా బాబూ... సచ్చేదాని బదులు ఏదన్నా పని చేసుకోని బతుక్కోవాల్నా.

వొయసులో నాకన్నా చిన్నోడివిగా వుండావు. కష్టం సుఖం విలువ నీకంటే నాకే బాగా తెలుసు. ముసలి నాకొడుకు... ఈనికేం తెలుసులే అనుకుంటావేమో.. తెలిస్తే ఇట్లెందుకు చేస్తాండావు అంటావేమో.. దయగల మారాజువు ఇంటానంటే చెప్తా.. ఇది మామూలు కత కాదు.. నిప్పులాంటి కత.. ఇని తట్టుకుంటానంటే చెప్తా..

అయితే ఇది ఒగమాటతో అయ్యే కత కాదు. ఒగరోజు కత కాదు. నా ఒగని కత కాదు.. నా యట్లా ఓల్లయి చానామంది కత.. చెప్తాను.

నేనెవుర్నో తెలుసా. చెంచునాయున్ని.. మాది ఈడికి వరమట ఉండాదే ఉస్తికాయలపెంట, ఆ ఊరు మాది. వచ్చే దీపావళికి నాకు అరవై యేండ్లయితాది.

మా ఊరు చుట్టూరా కొండలుండాయి. చెరువులుండాయి. పచ్చటి చెట్లుండే అడివుండాది. నేను పుట్టకముందే మాకు నూరు గొర్లుండె. యాభై ఎకరాల చేనుండె. పదెకరాల మడుండె. నేనా ఇంట్లో పెద్దోన్ని. సామెతుంది కదా.. ఇంట్లో పెద్ద కొడుకుగా పుట్టేదానికన్నా సాకలోనింట్లో గాడిదగా పుట్టేది మేలని. అట్లనే అయింది నా బతుకు..

ఇంట్లో పాలు పెరుగు నెయ్యి ఎంత కావాలంటే అంత.. మీ యట్లా ఊర్లనించి మా ఊర్లకు చుట్టాలొస్తే వోళ్లందరికీ మా అమ్మ నెయ్యి ఇచ్చంపతాండె. మా వూర్లో ఐదోతరగతి దాంకా ఈదిబల్లో చదువుకున్నే. పై చదువులు కావాలంటే సుండుపల్లెకో, రాయచోటికో పోవాల. లేదంటే పీలేటికి పోవాల. పీలేటికి పోవాలంటే ఇరవై మైళ్లు నడుసుకోని పోవాల. అయినా సదివి ఏం జేయాల? ఎంత సదివినా సేద్యం చేసుకోవాల్సిందే కదా.

మేం అన్నదమ్ములం ముగ్గరం. అరవై ఎకరాల సేద్దిం చేసుకుంటే చాలదా? సుఖంగా బతుక్కోవచ్చు. అందుకని మా నాయన నన్ను ఇంగ చదువు చాల్లే, సేద్దిం చేసుకో అనె.

నాగ్గూడా సేద్దిం పనులంటే బో కుశాలగా ఉండె. పదిమందికి అన్నం పెట్టేది మేమే కదా అని పొగురుగా ఉండె.. ధైర్నంగా ఉండె.

పద్దన్నే నిద్ర లేస్తానే చేన్లకాడికి పొయ్యొచ్చేటోన్ని. వస్తా వస్తా యేవపుల్ల ఇంచుకొనేటోన్ని. పండ్లు తోముకుంటా ఇంటికి వచ్చేలకు అమ్మ నీల్లు కాంచింటంది. సలసలమని మసల కాగిన నీల్లు పోసుకుంటా. అమ్మ సంగటి పెట్టి గడ్డపెరుగేస్తాది. అది తిన్నేంక కొడవలి తీసుకోని సేద్దిం కాడికి పోతా. గొడ్ల మేపేదానికి మనిసున్నేడు. సేద్దింకాడ ఏ పనుంటే ఆ పని చేస్తాంటి. చణం తీరిగ్గా వుండేటోన్ని కాదు. పని లేకుండా ఉంటే పిచ్చెక్కిపొయ్యేది. ఎండాకాలం వానలు కురసవు కదా? వానలు కురసకపోతే పంటలు పండవు కదా? అందుకని అప్పుడు నేస్తులతో కలిసి ఆట్లాడేది. పాటలు పాడేది. కతలు చెప్పుకునేది.. బలే బాగుండెలే.

మాకు యాబయి ఎకరాల చేనుండె అన్నే కదా.. చేన్లో చెనిగ్గింజలు ఏస్తాంటిమి. సద్దలు గూడా ఏస్తాన్నేము. చేన్లోనే బెండకాయలు, బీరకాయలు, మిరపకాయలు, మటిక్కాయలు ఏస్తాంటిమి.

మాకు రెండు కీనీర్ల బాయిలున్నేయి. వోటికింద పదెకరాల మడి సాగయితాండె. దాంట్లో వడ్ల గింజలు, రాగులు, ఎర్రగడ్డలు, ఇంగా కూరగాయలు పంటబెడతాంటిమి. వోటికి కపిల తోలతాంటిమి.

బాయిలో నీళ్ళుండాలే గానీ..

ఇంట్లో బక్కెన ఉంటాది..

గాట్లో ఎద్దులుంటాయి..

వోటిని తోలేదానికి ఎట్లా మనసలం ఉంటాం..

ఇంగ పంటెందుకు పండదు?

ఇత్తనం గింజలు, ఎరువులు ఎట్ల చేస్తాంటిరి అని అడగతావు? అంతే కదా?

అదీ చెప్తా..

ఎండాకాలం వచ్చిందంటే చెరువులు ఎండిపోతాయి కదా.. వోటి అడుగున ఎండిపోయిన బంకమన్ను, ఎద్దల బండ్లల్లో ఏసుకోనొచ్చి చేన్లల్లో తోలతాంటిమి. ఇంకా గొడ్లుండాయి కదా. వోటి పేడంతా దిబ్బలో ఏసింటాం. ఈ ఎరువును గూడా చేన్లల్లో తోలతాంటిమి. పంటలకు అంతకుమించిన ఎరువులేదుండాయి చెప్పు?

ఇంగ ఇత్తనం గింజలంటావా? అంతకుముందు పంటలో పండింటాయి కదా. వోటిల్లోంచి మేలిత్తనాలను తీసి ఎత్తిపెట్టుకుంటాం. తొలి ముంగార్ల వానలు పడతానే వోటిని తీసి నారుపోస్తాం. అయ్యన్నీ మేలిత్తనాలు కదా. బాగా మొలకెత్తతాయి. ఆ నారు నాటినామంటే బాగా పెర్గగతాయి. వోటికి రోగాలు కూడా రావు. మంచి పంట వొస్తాది.

ఎలిపంటలకయితే గొడ్ల ఎరువే సరిపోతాది. అదే వడ్లు పండించాలంటే ఎట్ల? అంటావేమో? దానికీ ఉపాయముండాది. గెనాలమింద చెట్లుంటాయి. లేదంటే చుట్టూ అడివే కదా.. పచ్చటి చెట్లే కదా.. వోటిల్లోంచి పచ్చాకు కొట్టి మోపులు కట్టి ఎద్దల బండ్లో

ఏస్తాం. మడికాడికి తోలుకోనొస్తాం. వోటిని మడికయ్యల్లో ఏసి మట్టిలో దిగబడి పొయ్యేటిగా తొక్కతాం. ఆ ఆకులన్నీ కుళ్లిపోతాయి. అది ఎంత మంచి ఎరువో తెలుసా?!

చూసినావాప్పా మా సేద్దిం ఎట్లున్నిందో..

యాడన్నా పైసా దుడ్డు కర్చయ్యిందా?

యిత్తనం గింజలు, ఎరువులు సరే.. వోటినంతా నాటాలంటే, కలుపు తీయాలంటే, కోతలు కొయ్యాలంటే మనుసులు కావద్దా అంటావేమో..! మనుసులు కావాల. అయితే వోళ్లలో చాలామంది చేసిన కూలీకి దుడ్డుకు బదులు గింజలు తీసుకునేటోళ్లు.. వోళ్లకు మాత్రం దుడ్డుతో పనేముండాది చెప్పు.. ఎప్పుడన్నా గుడ్డాగుసురు కావాలన్నెప్పుడు, ఏదైనా కార్యాలుండాయి అన్నెప్పుడే కదా దుడ్డవసరమయ్యేది!

అసలు మాకెవురికన్నా దుడ్డుతో పనేముండాది? మేం ఏం కొంటాము.. వడ్లు పండె, సద్దలు పండె, రాగులు పండె.. వోటిల్లోకి కూరలు కావాలంటే.., కందులు, ఉలవలు, అల్సందలు, పెసులు, అనుములు, చెనిక్కాయలు పండె.. ఇంగా కాయగూరలన్నీ పండిస్తాంటిమి. చింతచెట్లు ఇరవై ఉన్నేయి. ఊరందరికీ మా చెట్లనించి రాలిన చింతకాయలే సరిపోతాండె.

మేం కొంటాన్నింది సంగట్లోకి, కూరల్లోకి ఉప్పు మాత్రమే.

తక్కినోటియన్నీ కొనే అవసరం ఏముండాది?

చమురెట్ల చేస్తాంటిరి అంటావేమో..?

చెనిగ్గింజలు ఆడిస్తాంటిమి. ఇంట్లో కూరలకు తిరగమోతకు అయ్యే, దీగూట్లో దీపం పెట్టేదానికీ అయ్యే. తలకు నూనె గూడా కొనే అవసరం లేదు గదా. ఆముదాలు పండతాండె. వోటిని గానికేస్తే నూనొస్తాది. దాన్ని కాంచి పెట్టుకున్నేమంటే సమచ్చరమయినా గుమాలిస్తా ఉంటాది.

పండినోటిని సంతల్లో అమ్ముకోనొస్తాంటిమి. ఆ దుడ్డుతో గుడ్డా గుసురూ కొంటాంటిమి! రోజులు పచ్చపచ్చగా చల్లచల్లగా ఉంటాన్నేయి.

మనిసికెంత కావలప్పా.. నువ్వే చెప్పు? పూటకు పిడికెడు మెతుకులు, మానం కాపాడుకోదానికి జానడు గుడ్డ, సస్తే పూడ్సి పెట్టే దానికి ఆరడుగుల నేల..! ఇంతే కదా. మా చిన్నప్పుడు కూడా ఇంతే ఆలోచించేటోళ్లు.. చానామందికి అంతకుమించి ఆలోచన్లుండేటియి కాదు.

ఇప్పుడుమాదిర్తో అప్పుడు కరెంటు లేదు కదా.. కరెంటుంటే కదా ఫేన్లు, టీవీలు, మోటార్లు, జనరేటర్లు అవసరం అయితాయి!

ఎండాకాలం ఇంటి ముందర నులకమంచం ఏసుకోని పొనుకున్నేమంటే అంతకన్నా సొర్గముంటాదా.. ఎంత చల్లగా వస్తాంటాది గాలి.. చలికాలం సుట్టింట్లో పొనుకున్నేమంటే ఎంత ఎచ్చగా ఉంటాన్నేది. ఈడికొచ్చినాంక ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయితాండా.. తాగదామంటే గుక్కెడు నీళ్లిచ్చేటోళ్లు లేరు.. మంచి గాలి లేదు.. పొడుకుంటే బుర్రుబుర్రుమనే శబ్దాలు...

అయితే అంత మంచూరిని వదులుకోని ఈడికి ఎందుకొచ్చినావు అంటావేమో?!

అదీ చెప్తా.. దీని ఎనకాల గూడా చానా కతుండాది..

మేం ముగ్గురం అన్నదమ్ములం అన్నే కదా.. మా చిన్న తమ్ముడు సదువుకున్నోడు. అంటే పట్నం బోయి సదువుకున్నోడు. వోనికి ఉజ్జోగం వచ్చింది. వోని భార్యగూడా సదువుకొనిందే. నాజూకయిన బిడ్డ.. సేద్దింపనులు రావుగానీ, ఇంటి పనులూ, వంటపనులూ బాగా చేస్తాది. నాజూకయిన బిడ్డగదా.. పల్లెకొంపల్లో ఉండలేనని. సరే, వోళ్లిద్దరూ పట్నం పొయిరి.

మా నాయన బతికుండంగానే అస్తంతా మూడు బాగాలు చేసేసినాడు. మా బాగానికొచ్చినోటిల్లో మేమే దగ్గిరుండి సేద్యం పనులు చేసుకుంటాం. మా తమ్ముని బాగానికొచ్చినోటియి ఎవురు చేస్తారు? ఎట్ల చేస్తారు?

తొలి ముంగార్ల వోనలు పన్నేయి. చేన్లన్నీ దుక్కులు చేసుకోవాల కదా.. అందురూ ఆ పనే చేస్తాండారు. మొబ్బుతోనే ఎద్దల తోలుకోని మడక బుజాన ఏసుకోని సేన్లకాడికి పోతే, తిరుక్కోని వచ్చేది సందేలకే. సందేల సేద్యంకాన్నించి వచ్చి ఉడుకుడుకు నీళ్ల పోసుకోని, అంత తిని పడుకుంటే మళ్లా మెలకువొచ్చేది తెల్లారుజాముకే.

అబ్బుటికే మా ఊరికి ఇట్ల పీలేట్నించీ అట్ల సుండుపల్లె నుంచీ బస్సులు పన్నేయి. బస్సుల్లో పండించినోటియి ఏసకపోయి అమ్ముకోనురావడం మొదులుపెట్టినారు.

నాలుగు రూకలు కండ్ల జూడ్డం మొదులు పెట్టినాంక.., కూలోల్లకు రైతులకు మద్దెన దుడ్డు యవ్వారాలే నడిసినాయి!

ఒగరోజు పద్దన్నే మా చిన్నోడు పీలేట్నించీ టాక్టరు ఏసుకోనొచ్చినాడు. వోని బాగానికొచ్చిన చేనంతా ఒగటే రోజు దున్నించేసినాడు.

మేమంతా నిచ్చలకపోయినాం. వోన్ని జూసి గొడ్లు లేనోళ్లు గూడా టాక్టరుతోనే దున్నించుకున్నేరు. దున్నకాలయినాంక చెనిగ్గింజలేస్తాం కదా.. ఎరువులు కావాల కదా.. మా వోడు పట్నంనించే సంచుల్లో ఎరువులు ఏసుకోనొచ్చినాడు. ఆ ఎరువులేస్తే ఏం పండతాయిలే అనుకున్నేం. అయితే, మాకన్నా నాలుగ్గింజలు ఎక్కువ పండినాయి! అట్ల మొదులయింది సోమీ, టాక్టరుతో మా సంబంధం. టాక్టరుతో గంటలో అయిపోయే పనికి సమచ్చరం పొడుక్కూ గొడ్లను మేపేది దేనికి..? దండగ కదా అనుకున్నేరు చానామంది.

గొడ్లుంటే వోటిని మేపేదానికి మనిసుండాల.. యాడికన్నా ఊరికి పోవాలన్నే వోటితో ఇబ్బందే.. దుడ్డు పారేస్తే చాలు టాక్టరు దున్నేస్తాది, సంచుల్లో ఎరువులు తెచ్చుకోని ఏసుకోవచ్చు.. సులపాగా అయిపోయేదానికి కష్టపడేదెందుకు? అనుకున్నేరు చానామంది..

ఒగోరి ఇంట్లో గొడ్లు సంతకు పోతా వచ్చినాయి!

మడకలు అటకెక్కినాయి!

ఇబ్బుడు మా వూర్లో నాలుగు టాక్టర్లుండాయి.

అయ్యన్నీ దబ్బుండే మారాజులకు బేంకోల్లు లోన్లకిందిచ్చినారంట!

మా వోని బాగానికి మడి ఉండాది కదా.. వోటిల్లో పంటలు బెట్టాలంటే కపిల తోలాల.. కపిల తోలాలంటే ఎద్దులుండాల, మనిసుండాల... మా వోడేం చేసినాడంటే తొలీగా ఆయిలింజను తెచ్చి, మిసను బిగిచ్చినాడు. మా తిక్కు అదే తొలీ మిసను బాయి. ఇబ్బుటికీ ఆ బాయిలో నీళ్లు లేకపోయినా, దాన్ని మిసను బాయి అనే అంటారంతా. మళ్ల కరెంటొచ్చె. మా వోడు కరెంటు మిసను పెడదామనె.

మనం ఎబ్బుడన్నా గానీ నిజం మాట్లాడుకోవాలబ్బా.. పక్కనోడు సుకంగా ఉండాడంటే మనగ్గూడా అట్లే ఉండాలని అనిపిస్తాది. అయితే కష్టపడకుండా పంటలు పండించేది సుకమేనా? ఆ రోజుల్లో సుకమనే అనుకున్నేం.

మేంగూడా మా గొడ్లను అమ్ముకున్నేం.

మజ్జిగ నీళ్ళకోసం రెండావులను మాత్రం పెట్టుకున్నేం.

మా కీనీర్ల బాయిల్లో మోటార్లు పెట్టుకున్నేం.

తాలీగా బాగనే కుశాలగా వుండె.

మిసనుతో నీళ్ళు పైనొచ్చి పడతాంటే చూసేదానికి ఎంతమంది ఎగబన్నేరో... ఏకోజ్జాము నుంచి తెల్లారి పదిగంటలదాంకా కపిల తోలితే ఎకరా నేల పారేది కష్టంగా వుండె. మిసనొచ్చినాకా పనంతా రెండు గంటలే.

ఎంత పని సులువయిందో గదా అనుకున్నేం.

అయితే దానికి నెల నెలా కరెంటు బిల్లొచ్చేది. కట్టుకునేటోళ్ళం.

పుట్టి బుద్దెరిగినప్పట్నించీ ఏ పొద్దేగానీ ఎండిపోని బాయి, మిసను పెట్టినాంక సమచ్చరానికంతా ఎండిపాయ. అంటే నీళ్ళుంటాయిగానీ, అయ్యి ఒగపంటకు గూడా వచ్చేటియి గాదు. ఎందుకట్లా? కపిల తోలినప్పుడు సరిపోయే నీళ్ళు ఇప్పుడెందుకు చాలడంలేదు? అంటే మాకప్పుడు తెల్లా... అప్పుడు బక్కెన నీళ్ళు కుమ్మరించి పోయాలకు, బక్కెన్నీళ్ళు ఊరతాన్నేయి. దాంతో ఎంచేపు కపిల తోలినా బాయి నిండుకు వుండేది. మిసనొచ్చినాంక అది రాచ్చేసి మాదిర్తో నీళ్ళను తోడి గడ్డన ఏస్తాందాది. అంత బిన్నే నీళ్ళు ఊరవు కదా?

అబ్బుడే ఇంగోటొచ్చి పడింది మానెత్తిన... నిజానికి దాన్నబ్బుడు మా అదురుష్టమని అనుకున్నేం. ఎండిపోయిన బావుల్లో గవర్మెంటోళ్ళు ఉచితంగా బోర్లేసినారు. చాలా మంది. అట్లా బోర్లేసుకున్నేరు. మేంగూడా!

నీళ్ళెప్పుడూ పల్లానికే కదా పోతాయి!?

ఆమాత్రం ఆలోచన మాకు అబ్బుడు లేదు.

బోర్లేసేదానికి మళ్ళినాంక బావులు ఎండిపోబట్టె.

బావులు ఎండిపోతే మాకు బతుకులెట్ల?

మాకు సేద్యం తప్ప వేరే ఏం పనులు తెలుసు?

సేద్యం చేయాలంటే నీళ్ళుండాల కదా?

నీళ్ళుండాలంటే బోర్లేయాల?

బావులు ఎండిపోయినోళ్ళందరూ బోర్లేసిరి?

బోర్లేయాలంటే దుడ్డు కావద్దా.

దుడ్డుకోసరం అప్పులు చేసిరి?

మిసన్ల కోసరం అప్పులు చేసిరి?

నేనూ అప్పులు చేసినా...

బోర్లేసినా... బోర్ల మీద బోర్లేసినా...

అప్పులు చేసినా... అప్పుల మీద అప్పులు చేసినా...

అయితే, ఒరే ఇది తప్పురా... ఇట్ల అప్పులు చేయద్దండి... బోర్లేయద్దండి అని చెప్పినోళ్ళు లేకపాయిరి... అదేడిదాంకా పోయిందో తెలుసా? ఇబ్బుదు తాగుదామంటే గుక్కెదు నీళ్ళు దొరకడం లేదు. పంచాయితీ వాళ్ళు దినం మార్చి దినం పక్కూరి నుంచి టాక్టర్లో మా వూరికి నీళ్ళు తోలతాండారు! నీళ్ళు తోలిందానికి టాక్టరు బాడిగ ఊరోల్లమే తలా ఇంటికింత ఏసుకోని కట్టుకోవాల? ఇంతకంటే అన్నేయం ఇంగోటుంటాదా?

తాగే నీల్లకు గూడా దుడ్డు కట్టాల!

ఇంకొన్ని దినాలు పోతే పీల్చేగాలికి కూడా దుడ్డు కట్టాలేమో!

మా చిన్నప్పుడు పంటలు పండాలంటే పైసా కర్చు లేదంటిని కదా.

ఇప్పుడు ఇత్తనంగింజలు కొనుక్కోవాలంటే దుడ్డు కావాల.

ఎరువులు కొనుక్కోవాలంటే దుడ్డు కావాల.

దుక్కులు చేసుకోవాలంటే దుడ్డు కావాల.

నాట్లేసుకోవాలంటే దుడ్డు కావాల.

కలుపులు తీసుకోవాలంటే దుడ్డు కావాల.

కోతలు కోసుకోవాలంటే దుడ్డు కావాల.

కళ్ళం కాన్నించి గింజలు ఇంటికి తెచ్చుకోవాలంటే దుడ్డు కావాల!

ఇయ్యన్నీ ఒగెత్తయితే, ఆ పంటకు నీళ్ళు పారాలంటే కరెంటుకు నెలనెలా దుడ్డు కట్టాల! పంట పండనీ పండకపోనీ నెలనెలా కరెంటు బిల్లు మాత్రం వుంటాది.

ఇంత దుడ్డు యాట్నించీ వస్తాది?

ఇప్పుడు పంటలు పండించేది కూడా యాపారం అయిపోయిందాది! ముందుగా పెట్టుబడి పెడితేనే దిగుబడి, లేకుంటే లేదు. ఒగోసారి కరెంటుండదు. యాన్నో వైర్లు కాలిపోతాయి. లేదంటే టాన్స్‌ఫారం కాలిపోతాది. కరెంటోళ్ళు వచ్చి రిపేరు చేశాలకు వారమయితాదో, నెలయితాదో... ఈలోపల పంటలు ఎండిపోతాయి... అంటే దుడ్డు కర్చుబెట్టినా మనచేతల్లో ఏమీలేదు.

మాచిన్నప్పుడు కీనీరు బాయిల కింద పంటబెడితే చాలు... తప్పకుండా ఇంట్లోకి గింజలు వచ్చేటియి? ఇబ్బుడారోజులు పోయినాయి.

ఇదంతా ఒగెత్తయితే ఇంగోటుండాది సోమీ, చెప్పాల్సింది!

ఇబ్బుదు పంటబెట్టాలంటే దుడ్డు అవసరం అన్నేను కదా... మొదట్నుంచీ దుడ్డవసరం లేకుండా బతికినోళ్ళం కదా... ఎప్పుడన్నా గుడ్డా గుసురూ కావాలంటే, ఏదయినా కార్యాలబ్బుదు మాత్తరమే దుడ్డు అవసరం అయ్యేదన్నే కదా. అట్లా అవసరం వస్తే ఊర్లో ఏ అయ్యో ఒక అయ్య చేబదులు ఇచ్చేవోదు. లేదంటే ధర్మ వడ్డీకి ఇచ్చేవోదు. ఒగేళ పీనాసోడుండి చక్రవడ్డీ తీసుకున్నేదనుకో... ఊర్లో వాళ్ళంతా వోని మొగాన ఊంచేటోళ్ళు. అంతో ఇంతో మానం మర్యాదకు బయపడి అంత అన్యాయంగా వుండేటోళ్ళు కాదు.

అయితే, గవర్మెంటు సొసైటీ బేంకులు పెట్టె..!

మోటార్లు కొనుక్కునేదానికి లోన్లు..

ఇత్తనం గింజలు కొనుక్కునేదానికి లోన్లు...

ఎరువులు కొనుక్కునేదానికి లోన్లు...

బోర్లేసుకునేదానికి లోన్లు..

అన్నింటికీ లోన్లిచ్చిరి... ముందే చెప్పినా కదాప్పా... సుకమనేది మనిసికి బిన్నే అంటుకుంటాదని.

కపిల వదులుకోని, గొడ్లను అమ్ముకోని, గింజలను దాపెట్టుకోకుండాపోయాలకు... మాకు అన్నీ దుడ్డుతోనే పనాయ కదా... గవర్మెంటు లోన్లిస్తాందని తీసుకోవడం మొదలాయ.

పంటలమీద ఇచ్చే లోన్లు... పంటలు పండితే కదా తీర్చేదానికి. పంటలు పండాలంటే మాచేతుల్లోనే లేదు కదా..

ఇబ్బుడు పంట పండాలంటే...

ఇత్తనాలు మొలకెత్తాల... అయ్యి మంచి ఇత్తనాలో కాదో!

ఎరువులు ఎయ్యాల... అయ్యి మంచి ఎరువులో కాదో!

మాయదారి రోగాలొస్తాయి. వోటికేసే మందులు పనిచేస్తాయో చెయ్యవో!

చెట్లు బాగా పెరగతాయి... వాన కురస్తాదో కురసదో!

బోరులో నీళ్ళు మూడించీలు వస్తాయి... అయ్యి పంటలొచ్చేదాకా వస్తాయో రావో!

పంట బాగా పండుతాది... రేటుంటాదో ఉండదో..!

ఈటిల్లో ఏ ఒగటి ఇబ్బంది పెట్టినా మాకు పెట్టిన పెట్టుబడి కూడా రాదు.. ఇంగ సొసైటీ లోనెట్ల తీర్చాల... మేమెట్ల బతకాల..? ఒగటి రెండు పంటలు చేతికి రాకపోయినా మూడోపంట వచ్చేటిగా వుంటాదనుకో... అప్పుడొస్తారు గవర్మెంటోల్లు...

మాసేద్దేల కాడియి మోటార్లు పెరుక్కోని పోతారు...

మోటార్లు కూడా లేవంటే ఇండ్ల తలుపులు పెరుక్కోని పోతారు...

ఇంట్లో సామాన్లు ఎత్తుకోని పోతారు...

తింటామో పస్తుంటామో..., పరువుగా బతుక్కునేటోళ్ళం కదా...

పరువు పోకుండా ఉండాలంటే బయట నూటికి ఐదుగ్గాని, పదిగ్గాని వడ్డీకి తెచ్చి సొసైటీ వాళ్ళకు కట్టాల... ఊర్లో అప్పులు ఇచ్చినోడికి ఒగసారి కాకపోయినా ఒగసారయినా కనికరం ఉండేది. యాట్నుంచో వచ్చి, నెల జీతం తీసుకోని పని చేసేవాడికి మామింద కనికరం ఎందుకుంటాది?

ఇట్ల ఎంత అప్పుల పాలయినామో తెలుసా..?

ఈ అప్పులన్నీ మేం పంటలు పెట్టేదానికి చేసినోటియే. అయితే ఈటిల్లో మేం తినిందేమీ లేదు. తినిందెవరో నువ్వే చెప్పు? బాగుపడిందెవరో నువ్వే చెప్పు?

ఇయ్యన్నీ ఒగెత్తయితే... అసలుది ఇంగోటుండాది?

మేం చిన్నప్పుడు సేద్దేనికి మించింది లేదనుకునేటోళ్ళం...

పైసా కర్చు లేకుండా రెక్కల కష్టంతో బతికేయచ్చనుకునేటోళ్ళం...

ఇప్పుడా రోజులు పోయినాయి...

సేద్దిమంటే జూదమయి పోయిండాది...

అందుకే మాబిడ్డలకు సేద్దిం వద్దనుకున్నేం. నాలుగచ్చురాలు చదువుకుని ఉజ్జోగం చేస్తా, పల్లెలో సేద్దిం చేపిస్తా ఉండే మాతమ్ముదు..., వోని బిడ్డలను బాగా చదివిపిచ్చినాడు... మా బిడ్డలను గూడా వోని మాదిర్తో చదివిచ్చాలంటే అయితాదా...? అసలే అప్పుల్లో వుందా? అయినా సరే, బిడ్డలు బాగుపడాలని అప్పులు చేసి చదివిచ్చినా... అప్పులు మిగిలినాయి గానీ వోళ్ళకు ఉజ్జోగాలు రాలా.

చేతిలో బూములున్నే సేద్యం చేయాలంటే పెట్టుబడి కావాల? పెట్టుబడి కావాలంటే అప్పులు చేయాల? అబ్బుటికే మెడకు అప్పులు బిగుసుకోనుండాయి?

ఇట్లాటబ్బుడు పట్నంలో చదువుకోనొచ్చిన మా పిల్లోల్లు ఏమంటారు? మా పిల్లోల్లే కాదులే, ఎవురి పిల్లోల్లయినా ఉన్నోటియి అమ్ముకోని పట్నంబోయి యాపారం చేద్దామంటారు! అంతే కదా...!

వోళ్ళు యాపారంలో గట్టెక్కింటే నేనీ సచ్చేదానికి రావాల్సిన పని ఉండేది కాదు... అయితే వోళ్లు యాపారంలో ఎందుకు గట్టెక్కలేదు అంటావేమో.. అయ్యి నాకు తెలీని యిసయాలు... నాకు తెలిసింది సేద్దిం ఒక్కటే... దాని గురించే మాట్లాడతా సోమీ?

మా చేతుల్లోనించీ కపిల బానలు పొయ్యేటిగా చేసిందెవరు?

మా పల్లెల్లోకి టాక్టర్లను తెచ్చిందెవరు?

మాకు మేమే గొడ్లను అమ్ముకునేటిగా చేసిందెవరు?

ఇత్తనం గింజలను కొనుక్కునేటిగా చేసిందెవరు?

ఎరువులు కొనుక్కునేటిగా చేసిందెవరు?

కడాకు నీళ్ళను గూడా కొనుక్కునేటిగా చేసిందెరు?

సోమీ... టాక్టర్లను తప్పులు పట్టడం లేదు. సొసైటీ బేంకులను తప్పులు పట్టడం లేదు. కరెంటును తప్పులు పట్టడం లేదు. ఉచితంగా బోర్లేసిన గవర్మెంటును తప్పులు పట్టడం లేదు. అదేదో దేశంలో జనం తక్కువ, జాగా ఎక్కువంట. వోళ్ళకు సేద్దిం పనులు కావాలంటే మిషన్లేనంట... బీదా బిక్కీ ఉండే మనదేశంలో వోళ్ళమాదిర్తో చేయను అవుతుందా. ఏ గవర్మెంటయినా ఇది ఆలోచించిందా? ఇక్కడ ఏదవసరమో అది చేసిందా? నువ్వే చెప్పు...!

సోమీ...

ఇయ్యన్నీ తెలుసుకున్నే, ముసలి మోపన నేనేం జేస్తాను! బియ్యం దరలు, కూరగాయల దరలు అగ్గిమాదిర్తో ఉండాయని అల్లాడిపోతాండారు గదా... ఇంగన్నా మాయట్లాటోల్ల గురించి ఆలోచించండి... మేం సావకుండా ఉండేదానికి మార్గం చూపండి. మేం సావకుండా ఉంటేనే మీ యట్లా వోళ్లకు పిడికెడు మెతుకులు దొరికేది. •

**(కె. శ్రీనివాస్ గారి 'శంభుని శిరంబు నుండి' చదివాక...)**

**–జులై 2009న తిరుపతిలో కేంద్రసాహిత్య అకాడమీ నిర్వహించిన**

**'రైతు కథ' సదస్సులో చదివిన కథ.**

**20 సెప్టెంబర్ 2009 వార్త**